నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇజ్జత్‌నగర్ విలేజ్, శిల్పాహిల్స్ రోడ్డు నెంబర్ 1,2,3, సన్‌షైన్ అపార్ట్‌మెంట్స్, అపర్ణ విల్లాస్, న్యాక్, వసంతసిటీ, సైబర్ విలేజ్, సైబర్ వ్యాలీ,సీసీ ఆర్‌టీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్‌లో..

చందానగర్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

◆ మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు మాతృశ్రీనగర్ కొంతభాగం, విజయ సూపర్ మార్కెట్, టెంపుల్ పార్కు, మాధవనగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండన్నారు.

◆ హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్‌నగర్, రైల్వే స్టేషన్ ఏరియాలలో..

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

సురక్షా ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యానగర్, సురక్షా ఎన్‌క్లేవ్, సురక్షాహిల్స్, శుభోదయ కాలనీ, పద్మజ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, అపర్ణ హెచ్‌టీ సర్వీస్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: నల్లగండ్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోపన్‌పల్లితండా, ఎన్‌టీఆర్‌నగర్, తాజ్‌నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

◆ బాపూనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాపూనగర్, నెహ్రూనగర్, గోపీనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వారు వివరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్ – 2 డిపో పరిధిలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో ఆర్టీసీ బస్సుల సేవలకు సంబంధించి సమస్యలతో పాటు సూచనలు, సలహాలు ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. గురువారం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959226420కు ఫోన్ చేయాలని తెలిపారు.

ఇక 'ఆటోమేటెడ్' చెత్త సేకరణ



మాదాపూర్: నగర పరిశుభ్రత కోసం 6 ఆటోమేటెడ్ ఎలక్ట్రిక్ చెత్తసేకరణ యంత్రాలను మాదాపూర్‌లోని ఇనార్బిట్ వద్ద బుధవారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ యంత్రాలను ఎక్కువ ట్రాఫిక్ ఉన్న ప్రాంతాలలో ఉంచారు. కొండాపూర్, బొటానికల్ గార్డెన్, ఇనార్బిట్‌మాల్, దుర్గంచెరువు, హైటెక్‌సిటీ, శిల్పారామం, స్ట్రీట్‌ఫుడ్ ఏరియా, రాయదుర్గం మెట్రోస్టేషన్ తదితర ప్రాంతాలలో శుభ్రం చేసేందుకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్పార్క్‌లింగ్ ప్రాజెక్టు ద్వారా పరిశుభ్రత అమలు చేస్తామని ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టును ఇనార్బిట్‌మాల్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇనార్బిట్ మాల్స్, కె.రహేజా కార్ప్, జీహెచ్ఎంసీ, నిర్మాణ్ ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్చిలో 150 'ఇందిరా' క్యాంటీన్లు ప్రారంభం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 25వ తేదీ నాటికి 150 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు 'సెర్ప్' డైరెక్టర్ డబ్ల్యూ జాన్సన్ వెల్లడించారు. గచ్చిబౌలిలోని నిథమ్‌లో 7వ బ్యాచ్ మహిళల శిక్షణ ముగింపు కార్యక్రమంలో వారికి సర్టిఫికెట్లను అందించిన అనంతరం ఆయన ఆయన మాట్లాడారు. ముడిసరుకులు, వంటగది నిర్వహణ బాధ్యత మహిళలదేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 300 మంది మహిళలకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 7 బ్యాచ్‌లలో కలిపి 190 మందికి శిక్షణ అందించామన్నారు. మరో మూడు బ్యాచ్‌లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాలన్నీ పర్యాటక శాఖ, నిథమ్ డైరెక్టర్ జెడ్ హనుమంత పర్యవేక్షణలో సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సెర్ప్ డీపీఎం హమీద్, నిథమ్ శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారి మిషెల్లీ జే ఫ్రాన్సిస్, నిథమ్, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.



సీఎస్‌ఆర్‌తో సుందరీకరణ

ముందుకొచ్చిన మల్లిగావార్డ్ ఫౌండేషన్

మారనున్న గురునాథం చెరువు రూపురేఖలు

మియాపూర్: ఒకప్పుడు సాగు, తాగునీరందించిన గురునాథం చెరువు మురుగుమయంగా మారింది. చెరువు చుట్టూ అపార్ట్‌మెంట్, కాలనీలు ఏర్పాటవడంతో వాటి నుంచి వెలువడే మురుగునీరు చెరువులోకి చేరి కలుషితమైంది. దశాబ్దాల కాలంగా చెరువులో గుర్రపుడెక్క, మురుగునీటితో చుట్టుపక్కల కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో ఓ ప్రైవేట్ సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ క్రమంలో పనులు ప్రారంభమయ్యాయి.



గుర్రపుడెక్కతో నిండిన గురునాథం చెరువు (ఫైల్)



చెరువు సుందరీకరణకు మల్లిగావార్డ్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. చెరువులో ఉన్న నీటిని పూర్తిగా తొలగించి భారీ యంత్రాలతో పూడికతీత పనులు చేపట్టారు. చుట్టుపక్కల కాలనీల నుండి వచ్చే మురుగునీరు చెరువులోకి రాకుండా దారి మళ్లించారు. చెరువును మంచినీటితో నింపి చుట్టూ వాకింగ్‌ట్రాక్స్, ఆహ్లాదకర వాతావరణంతో ప్రజలు సేద తీరే విధంగా తీర్చిదిద్దనున్నారు. చెరువు చు ట్టూ పచ్చదనం, పిల్లల ఆటవస్తువులు, చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. సుందరీకరణ పనులు ప్రారంభం కావడంతో చుట్టుపక్కల కాలనీలవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి ఆహ్లాదకర వాతావరణం



గరునాథం చెరువు సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ చొరవతో చెరువు అభివృద్ధికి నోచుకుంది. చెరువు సుందరీకరణ పూర్తయితే మియాపూర్ ప్రాంతవాసులకు మంచి వాతావరణం అందుబాటులోకి వస్తుంది.

– శివప్రసాద్‌రెడ్డి, మియాపూర్

కొత్తరూపు సంతరించుకోనుంది



గురునాథం చెరువు త్వరలోనే కొత్తరూపు సంతరించుకోనుంది. నెక్సెస్ మాల్ సీఎస్ఆర్ నిధులతో మల్లిగావార్డ్ ఫౌండేషన్ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే గాంధీ సహాయసహకారాలతో మియాపూర్ గురునాథం చెరువు కొత్త అందాలను సంతరించుకోనుంది.

– కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

◆ మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు సుమారు 27 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. చెరువు చుట్టూలున్నఅపార్ట్‌మెంట్లు, కాలనీల నుండి వచ్చే మురుగునీరు చెరువులోకి చేరడంతో మురికికూపంలా మారింది. గుర్రపు డెక్క, చెత్తా చెదారంతో నిండిపోయింది. దోమలు, దుర్గంధంతో పరిసరప్రాంతవాసులు అనారోగ్యం బారినపడుతున్నారు. గతంలో ఎమ్మెల్యే గాంధీ సొంత నిధులతో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రతియేటా చేయించారు. మరలా కొన్ని రోజులకే గుర్రపు డెక్క అల్లుకుపోయేది. దీంతో ఎమ్మెల్యే చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

◆ నెక్సెస్‌మాల్ ఆధ్వర్యంలో మల్లిగావార్డ్ ఫౌండేషన్ పర్యవేక్షణలో సీఎస్ఆర్ నిధులతో గురునాథం చెరువు సుందరీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. చెరువు సుందరీకరణ పనులు పూర్తయితే మియాపూర్ ప్రాంతవాసులకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి వస్తుంది.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికే డయల్ యువర్ డీఎం

రాయదుర్గం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్నినిర్వహించారు. కార్యక్రమంలో మసీదుబండకు చెందిన భగవాన్‌దాస్ మాట్లాడుతూ కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి మసీదుబండ ద్వారా బస్సులు రాకపోకలు సాగించేలా చూడాలని కోరారు. కిష్టారెడ్డిపేట అనంతరామ్ మాట్లాడుతూ పటాన్‌చెరు నుంచి బీరంగూడ, కిష్టారెడ్డి, మల్లంపేట మీదుగా బాచుపల్లి వరకు బస్సును నడపాలని కోరారు. అలాగే బీరంగూడకు చెందిన భిక్షపతి మాట్లాడుతూ పటాన్‌చెరు నుంచి బీరంగూడ కమాన్ నుంచి కిష్టారెడ్డిపేట్ సుల్తాన్‌పూర్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆయా రూట్లలో ప్రయాణించి రోడ్డు సౌకర్యం, సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎం మురళీధర్‌రెడ్డి

గాంధీజీ సూత్రాలు బలమైన పునాదిని అందిస్తాయి

ఐసీఎస్ఎస్ఆర్ సభ్యురాలు ప్రొఫెసర్ షీలారాయ్

రాయదుర్గం: జర్నలిజంలో ప్రస్తుతం సంచలనాలు, తప్పుడు సమాచారం సహా అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని, గాంధీజీ సూత్రాలు గొప్ప మేలు ,బలమైన పునాదిని అందిస్తాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) సభ్యురాలు ప్రొఫెసర్ షీలారాయ్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'మహాత్మా గాంధీ జర్నలిజం ..సమకాలీనయుగంలో దాని ఔచిత్యం' అనే అంశంపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ (ఎంసీజే), ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె సత్యం, అహింస, సామాజిక బాధ్యత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఎంసీజే విభాగం డీన్, హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ విద్య, అభ్యాసంలో గాంధీ ఆదర్శాలను ఏకీకృతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 'మనూ' ఫ్యాకల్టీ, అధికారులు, ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పసిబిడ్డను కాపాడిన నిలోఫర్ డాక్టర్లు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పుట్టిన చిన్నారికి.. నిలోఫర్ డాక్టర్లు ప్రాణం పోశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లింగంపల్లికి చెందిన తోమేశ్వరి, కృష్ణ దంపతులకు పాప పుట్టింది. బిడ్డలోఎలాంటి కదలిక లేకపోవడంతో వైద్యులు 108 వాహనానికి సమాచారం అందించి అంబులెన్స్‌లో ఈఆర్‌సీపీ డాక్టర్ మౌనిక ఆదేశంపై, ఈఎంటీ యాదగిరి, పీఐ చందు పర్యవేక్షణలో సీపీఆర్, బీవీఎం చేస్తూ నగరంలోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు సత్వరం వైద్యమందించడంతో పసికూనకు ప్రాణాపాయం తప్పింది. దీంతో తల్లిదండ్రులు, వైద్యులు ఊపిరిపీల్చుకున్నారు.

సర్వేపై డీసీ సమీక్ష

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే 84 శాతం పూర్తి అయిందని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చందానగర్ అంబేద్కర్ కల్యాణ మండపంలో సర్వేయర్లు, సూపర్‌వైజర్లు, నోడల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో మిగిలిన 3 వేల దరఖాస్తుల సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ అలాగే నిర్ణీత గడువులోపు ఆస్తి పన్ను కూడా వసూలు చేయాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారులతో పాటు సూపర్‌వైజర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్నాం

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్: ప్రజా సంక్షేమం, కాలనీల అభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో సుమారు రూ.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓల్డ్ హఫీజ్‌పేట్‌లోని బావర్చి హోటల్ నుంచి వార్డు కార్యాలయం.. కాయిదమ్మకుంట చెరువు వరకు రూ.45 లక్షలు, మైత్రీనగర్ ఫేజ్ 1లో రూ.25 లక్షలతో సీసీ రోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీటవేస్తామన్నారు. నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తదితరులు

నేటి నుంచి అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

4రోజుల పాటు నిర్వహణ



రాయదుర్గం: నానక్‌రాం గూడ ఔటర్ రింగురోడ్డులో ఉన్న శ్రీరామ్‌నగర్‌లో అభయాంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవా లను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 5.30 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. శుక్రవారం ఉదయం 6.30 గంటలకు అభయాంజనేయస్వామి వారికి విశేష అభిషేకం, ఆకుపూజ, ధ్వజారోహణం .. సాయంత్రం 5గంటలకు చతుస్థానార్చన మూల మంత్రహోమం, 6 గంటలకు చిన్నజీయర్ స్వామివారి భక్తురాలు విజయకృష్ణచే ప్రవచనాలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ జే యాదవరావు వివరించారు.

గణేష్‌గడ్డ కిటకిట



పటాన్‌చెరు టౌన్: మౌని అమావాస్య నేపథ్యంలో రుద్రారం గణేష్‌గడ్డ ఆలయంలో బుధవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్పలు పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ తెలిపారు.

చెరువు సుందరీకరణ పనులు పరిశీలన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వాకింగ్‌ట్రాక్, సుందరీకరణ, వ్యర్థాల తొలగింపు పనులను ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, వాకర్స్‌తో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాగింగ్ జరిగేలా చూడాలని అధికారులకు తెలిపారు. అదే విధంగా పలు కాలనీల ప్రజల నుంచి వినతుల మేరకు సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు

మియాపూర్: మియాపూర్ స్టాలిన్‌నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వీధిదీపాల పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ, బస్తీలలో వీధిదీపాల సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఆయన వెంట జీహెచ్ఎంసీ స్ట్రీట్‌లైట్స్ సూపర్ వైజర్ శ్రీనివాస్, స్టాలిన్ నగర్ కాలనీవాసులు రాణి, వెంకటేష్, శ్యామల, నరేష్, మోహిన్ తదితరులున్నారు.

ప్రతీ హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఉండాలి

మాదాపూర్ డీసీపీ వినీత్



హాస్టళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి: పీజీ హాస్టళ్లలో భద్రతా ప్రమాణాలు పాటించాలని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఐటీ కారిడార్‌లోని హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. హాస్టళ్లలో ఉండే వారి పూర్తి వివరాలతో పాటు ఎక్కడ పని చేస్తారో ఆ వివరాలను భద్రపర్చాలని పేర్కొన్నారు. గదులను శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని చెప్పారు. నిబంధనలు పాటించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. పోలీసులు హాస్టళ్లను తరచు తనిఖీలు చేస్తూ నిఘా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ ఎస్.జయరాం, ఏసీపీ సీహెచ్ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్లు హబీబుల్లాఖాన్, సీహెచ్ వెంకన్న, కృష్ణమోహన్, హాస్టళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానమే

రంగారెడ్డి డీటీఓ సదానంద్



కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆఫీసర్ సదానంద్

గచ్చిబౌలి: రక్తదానం ప్రాణదానమే అని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సదానంద్ అన్నారు. బుధవారం కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందిస్తే ప్రాణాలను కాపాడేందుకు వీలుంటుందన్నారు. ప్రతి ఒక్కరు రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత నెల రోజులుగా ఆటో స్టాండ్‌లు, స్కూల్స్ తదితర ప్రాంతాలలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు హెల్మెట్, సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో బైకిస్టులు, పాదచారుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. రెడ్ క్రాస్ సంస్థకు రక్తం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎవీఐలు కిరణ్‌కుమార్, కృష్ణవేణి, ఎఎంవీఐలు మనోజ్, శ్రీముక్తి తదితరులు పాల్గొన్నారు.

బహుభాషలు నేర్చుకోవడం అవసరం



మాట్లాడుతున్న వీసీ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: బహుభాషలు నేర్చుకోవడం అవసరమని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'భారతదేశంలో ఆంగ్లభాష చరిత్ర.. పరస్పర చర్యలు' అనే అంశంపై మూడవ హిస్టరీ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ (హెచ్ఈఎల్ఈ) మూడవ సదస్సును బుధవారం ప్రారంభించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ప్రపంచ దృక్పథాన్ని అవలంబించడం చాలా అవసరమన్నారు. ఇంగ్లీష్ ప్రొఫెసర్ వివిఎన్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సమకాలీన బోధనా శాస్త్రంలోని సవాళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం 24 మంది పరిశోధక విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పత్రసమర్పణ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సల్మాహ్మద్ ఫారూఖీ, ఇంతియాజ్ హస్నైన్, రాహత్ ఫిరోజ్, సమీనా తబస్సుమ్ పాల్గొన్నారు.

నేర్చుకున్నారు.. నోరూరించేలా తయారుచేశారు



తెలంగాణ స్నాక్స్, వివిధ రకాల బిర్యానీలు, విభిన్న రకాల టీ, టిఫిన్స్, స్వీట్ల తయారీపై మహిళలకు నిథమ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్‌లో గత సోమవారం ప్రారంభమైన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ 7వ బ్యాచ్ శిక్షణ బుధవారంతో ముగిసింది. 10 రోజులపాటు శిక్షణ పొందిన 29 మంది మహిళలు నోరూరించేలా వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. - రాయదుర్గం

ఐటీ ఉద్యోగి అరెస్ట్

విలాసవంతమైన జీవితం గడిపేందుకు దొంగతనాలు



నిందితుడు హరీశ్‌కృష్ణ

మాదాపూర్: విలాసవంతమైన జీవితం గడిపేందుకు ఓ ఐటీ ఉద్యోగి దొంగతనం చేసి దొరికిపోయిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం. కాళహస్తి హరీశ్‌కృష్ణది కడప జిల్లా ఖాజీపేట. బీటెక్ చదివి గచ్చిబౌలి ఏరియాలో ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటి సమస్యల కారణంగా భార్యకు విడాకులు ఇచ్చాడు. విలాసవంతమైన జీవితానికి బానిసై జీతం సరిపోకపోవడంతో దొంగతనాలు, దోపిడీలు చేస్తున్నాడు. కాగా మాదాపూర్ అయ్యప్పసొసైటీ చందానాయక్‌తండా దేవి హోమ్స్‌లో కేవీ మణికంఠ నివాసముంటున్నాడు. మణికంఠ కదలికలు, దినచర్యను హరీశ్‌కృష్ణ తెలుసుకున్నాడు. బుధవారం క్రికెట్ ఆడడానికి వెళుతున్నట్లు గమనించిన నిందితుడు మధ్యాహ్నం తర్వాత మణికంఠ ఇంట్లోకి చొరబడి అతని భార్యను కత్తితో బెదిరించి రెండు బంగారు గాజులు లాక్కున్నాడు. విషయం తెలుసుకున్న మణికంఠ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి నిందితుడిని గాజుల రామారంలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 20 గ్రాముల రెండు బంగారు గాజులు, బైక్, ఒక కత్తి, ఐ క్యూ స్మార్ట్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి.విజయ్‌నాయక్, హెచ్‌సీ మహేందర్, చెన్నప్ప, కేశవులు, పీసీ రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 'యాంటీ డ్రగ్' విధానం అమలులో ఉంది



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌సీయూ డీఎస్‌డబ్ల్యూ, సైబర్‌క్రైమ్స్ టీమ్స్, టీజీసీహెచ్ఈ అధికారులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'యాంటీ డ్రగ్స్' విధానం అమలులో ఉందని హెచ్‌సీయూ స్టూడెంట్స్ వెల్ఫేర్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ ఎన్.రుక్మారేఖ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో తెలంగాణ సైబర్ క్రైమ్ టీమ్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, హెచ్‌సీయూ డీఎస్‌డబ్ల్యూ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సీఐఎస్ ఆడిటోరియంలో 'సైబర్ క్రైమ్స్‌పై ప్రత్యేక అవగాహన' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రుక్మారేఖ మాట్లాడుతూ క్యాంపస్‌ను డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్‌గా మార్చడంలో అందరినీ భాగస్వాములను చేశామన్నారు. అందరూ సంపూర్ణంగా సహకరించడంతో ఇది సాధ్యమయిందన్నారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆశిష్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ భద్రతా పద్ధతులను అందరూ అనుసరించడం చాలా ముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల అపోహలకు సమాధానాలను సైబర్‌క్రైమ్ విభాగం అధికారులు వివరించారు. కార్యక్రమంలో టీజీసీహెచ్ఈ కన్సల్టెంట్ అన్నపూర్ణ గాదెపల్లి, దిల్‌సే వలంటీర్లు సునీల్ సోమనగుర్తి, సాయినాథ్‌చారి, హెచ్‌సీయూ విద్యార్థులు, డీఎస్‌డబ్ల్యూ విభాగ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.